క్లుప్తంగా

రేపు బ్రెయిలీ జయంతి

నిర్మల్‌చైన్‌గేట్: అంధుల కోసం లిపిని తయారు చేసిన లూయిస్ బ్రెయిలీ216వ జయంతి కార్యక్రమాన్ని ఈనెల 4న కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు జరిగే కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొనాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శ్రీ మహాలక్ష్మి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం కమిటీ సభ్యులు లెక్కించారు. రూ.25,044 నగదు, కొంత బంగారం, వెండి సైతం వచ్చినట్లు తెలిపారు. సభ్యులు కారింగుల రాములు, కె.గోపాల్ కిషన్, కె.వెంకటేశ్వర్లు, వెంకటప్పయ్య, ప్రభాకర్, రాజేందర్, సందీప్, వెంకటరమణ ఉన్నారు.

కల్లు బట్టి తొలగించండి


వినతిపత్రం అందిస్తున్న మహిళలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని నాయుడివాడ ఎస్సీ కాలనీలో ఉన్న కల్లుబట్టి, బెల్టుషాపును తొలగించాలని కాలనీవాసులు గురువారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇళ్ల మధ్యన బెల్టుషాపులో అర్ధరాత్రి వరకు విక్రయాలు సాగుతున్నాయని.. దీంతో ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేశారు. వెంటనే తొలగించాలని కోరారు.

క్రమశిక్షణతో మెలగాలి

ఖానాపూర్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం పట్టణంలోని కళాశాలలో హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షకులు షరీఫ్, శ్రీకాంత్.. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టేందుకు పలు సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

చెప్పిన పాఠాలు చదవాలి


మాట్లాడుతున్న ఎంఈవో చంద్రకాంత్

లోకేశ్వరం: సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున విద్యార్థులు ఇప్పటివరకు చెప్పిన పాఠాలను చదువుకోవాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీని సందర్శించి.. విద్యార్థినులతో మాట్లాడారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. సమ్మె ముగియగానే ఉపాధ్యాయులు వచ్చి పాఠాలు బోధిస్తారని.. ఎవరూ ఇళ్లకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇళ్ల సర్వే పరిశీలన

తానూరు: మండలంలోని నంద్‌గాం, సింగన్‌గాం తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఎంపీడీవో అబ్దుల సమద్ పరిశీలించారు. నమోదు వివరాలను తెలుసుకున్నారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కుభీర్: మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. గురువారం చాతా గ్రామంలో 200 ఇళ్లను సర్వే చేశారు. పంచాయతీ కార్యదర్శులు కమల్‌సింగ్, సురేశ్, చందన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

శివలింగంపై పాము


శివలింగంపై పాము

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ శివాలయంలో ఓ పాము విన్యాసం ఆకట్టుకుంది. గురువారం శివాలయంలోకి భారీ పాము ప్రవేశించి శివలింగంపై ఆడింది. భక్తులు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

సదర్ బోనాల పండుగ


బోనాలతో వస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న నడింపల్లె గ్రామంలో గురువారం నల్ల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మకు సదర్‌బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నాణ్యతలేమితో అవస్థలు

- అధ్వానంగా రాజాపూర్‌తండా– సూర్యాపూర్ రోడ్డు
- దెబ్బతిన్న రెండు వంతెనలు
- రాకపోకలకు భయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


రెండో వంతెన వద్ద బుంగ


రాజాపూర్ నుంచి వచ్చే మార్గంలో కుంగిన మొదటి వంతెన పిల్లర్, కూలిన రక్షణ గోడ

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి రోడ్లు, వంతెనలు నిర్మిస్తోంది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నాసికరంగా చేపడుతున్నారు. దీర్ఘకాలం మన్నికగా ఉండాల్సిన రోడ్లు, వంతెనలు.. ఐదారేళ్లకే దెబ్బతింటున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ప్రమాద స్థితిలో వంతెనలు..

కుంటాల మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్ తండా నుంచి సూర్యాపూర్ వరకు (1.6 కిలోమీటర్ల మేర) 2017–18 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్ ప్రాజెక్టు నిధులు రూ.90 లక్షలతో కంకర, మట్టి రోడ్డు, వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. అవసరమైన చోట వాగులపై రెండు వంతెనలు, వరద నీటి ఉధృతిని తట్టుకునేలా నాలుగు కల్వర్టులు నిర్మించారు. కానీ భారీ వర్షాలకు రాజాపూర్ తండా నుంచి సూర్యాపూర్ వచ్చే మార్గంలో మొదటి వంతెన పిల్లర్ కూలి ప్రమాదకరంగా మారింది. రెండో వంతెనకు ఇరువైపులా పెద్ద పెద్ద బుంగలు ఏర్పడ్డాయి.

అధ్వానంగా మట్టి రోడ్డు ..

మండలంలోని రాజాపూర్ నుంచి సూర్యాపూర్


గుంతలమయంగా మట్టిరోడ్డు

ప్రతిపాదనలు పంపిస్తాం..

వంతెన పిల్లర్ కుంగినట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలో వంతెనలతోపాటు రోడ్డును పరిశీలిస్తాం. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– గౌరీశ్, పీఆర్ ఏఈ

మట్టి రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుతో సూర్యాపూర్, అంబుగామ, మెదన్‌పూర్ గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గుతుంది. కానీ పనుల్లో నాణ్యత లోపించడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. నిర్వహణ లేక రోడ్డుపై పిచ్చిమొక్కలు పెరిగాయి.

ఇష్టానుసారం పనులు చేపట్టడంతోనే..

ప్రణాళిక లేక ఇష్టానుసారం పనులు చేపట్టడంతో నిధులు వృథా అయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వంతెనలకు, రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

పిల్లర్ కూలింది



ఇటీవల కురిసిన వర్షాకు వంతెన పిల్లర్ కూలింది. మరో వంతెన వద్ద బుంగలు ఏర్పడ్డాయి. ఈ వంతెనలపై నుంచి ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తుంది. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– పవార్‌బాబు, రాజాపూర్‌తండా

మరమ్మతులు చేపట్టాలి



రాజాపూర్ నుంచి సూర్యాపూర్ వరకు ఇష్టానుసారం రోడ్డు నిర్మించారు. రోడ్డు ప్రణాళికాద్ధంగా వేయలేదు. వర్షాకాలంలో వరదలతో పంటలు నష్టపోతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– బక్కి లక్ష్మణ్, సూర్యాపూర్

సేవాగుణం అలవర్చుకోవాలి

- ఎస్పీ జానకీషర్మిల


విద్యార్థికి దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, పక్కన డాక్టర్ జనార్దన్

నిర్మల్‌రూరల్: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మండలంలోని కొండాపూర్ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో విద్యార్థులు, వృద్ధులకు గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఇందులో పునరావాస కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రవాస భారతీయులు డాక్టర్ పన్నెల జనార్దన్, సంస్థ డైరెక్టర్ శనిగారపు చిన్నయ్య, డాక్టర్ కష్ణంరాజు, సాయి ప్రసాద్, బండారి రమేశ్, రేఖ, ఉమ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఎన్ఆర్ఐ అండ

ఖానాపూర్: పట్టణంలోని 43 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా పట్టణ పరిశుభ్రత కోసం ప్రజలు చేస్తున్న సేవలు మరువలేనివని జనార్దన్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, నాయకులు కిశోర్‌నాయక్, జన్నారపు శంకర్, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

అపరిచితుల వాహనాల్లో వెళ్లొద్దు


తానూరులో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

తానూరు: మండలంలోని బోసి సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రమేశ్ మాట్లాడుతూ పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు గుర్తు తెలియని వాహనాలపై వెళ్లవద్దని విద్యార్థులకు సూచించారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున.. అపరిచితుల నుంచి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. హెచ్ఎం దత్తాత్రి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాల: సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలని ఎస్సై సీహెచ్. భాస్కరాచారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మోసపోతే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఎస్సైలు రాందాస్, జీవన్‌రావు, అర్చకులు రమేశ్, సాయికిరణ్, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏఎస్పీని కలిసిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

లక్ష్మణచాంద: జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో నూతన అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పీఆర్ డిప్యూటీ ఇంజినీర్ రాజేందర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్‌ను.. గురువారం ఆ పార్టీ లక్ష్మణచాంద మండల అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరిపెల్లి రాం కిషన్ రెడ్డి ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

లోకేశ్వరం: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శిగా కోల్కొండ రాజేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విజయ్‌సాయి కుభీర్ మండలంలోని సోనారికి బదిలీపై వెళ్లారు. రాజేశ్వర్ గతంలో కుభీర్‌లో పని చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. నరసింహస్వామి, సాయిలు, రాజేశ్వర్, గంగాధర్, సుధీర్ ఉన్నారు.

వార్షికోత్సవం జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆలయ ఆవరణలో మాట్లాడారు. ఆలయం ఎదుట ఉన్న రెండెకరాల స్థలాన్ని దాత నుంచి తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. కల్వకుంట్ల నారాయణ, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు కె. సురేష్, లక్ష్మణరావు, శ్రీనివాస్, సత్తయ్య, సంజీవ్‌రావు, రాజన్న, రమేశ్, చంద్రహాస్, తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు

ముధోల్: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ యోగేశ్, సభ్యులు షఫీ ఉల్లాఖాన్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, రాహుల్, చంద్రామణి, గంగారెడ్డి, సునీల్, అబ్బుబాయ్, ఉమేశ్, నాగేశ్, రమేశ్, విజయ్ ఉన్నారు.

బాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. బైంసా, లోకేశ్వరం,నర్సాపూర్(జి), కుంటాల మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శబరిమలై బయలుదేరిన స్వాములు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు గురువారం శబరిమలై బయలుదేరి వెళ్లారు. జంగం సాయినాథ్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు ఇరుముళ్లు కట్టుకొని ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్ మామ ఇటీవల సోలార్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరామర్శించారు. ఈసందర్భంగా పెద్ద భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేందర్, గంగనర్సయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్(ఆల్ ఇన్ వన్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కూనింటి చంద్రమోహన్‌రెడ్డి, క్లబ్ రీజియన్ సెక్రటరీ వట్టిమల్ల నర్సయ్య, జోన్ చైర్మన్ లక్కడి రాజేశ్వర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

బూత్ కమిటీల ఏర్పాటు

మామడ: మండలంలోని మామడ, పొన్కల్, కమల్‌కోట్ గ్రామాల్లో గురువారం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. మామడ పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులుగా శమంత్‌రెడ్డి, సురేశ్‌చారి, తబ్రేజ్, సురేశ్, పొన్కల్‌లో ముత్యం, రవి, రాజారెడ్డి, గంగాధర్, కమల్‌కోట్‌లో సుధీర్‌రెడ్డి, లింగారెడ్డిలను ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, జిల్లా కార్యదర్శి శ్రవన్ రెడ్డి, రాజు, నవీన్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

భైంసా: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి మంచి పేరును తీసుకురావాలని కౌన్సిలర్ చందులాల్ ఆకాంక్షించారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ ఏపీనగర్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి రాజేశ్వరి జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం రాజేశ్వరిని సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు కొంతం అడెల్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శంకర్, ఉపాధ్యాయులు సుచరిత, శిల్ప, శంకర్, అభినయ్, గిరినాథ్, భీంరావు, దిలీప్ ఉన్నారు.


భూమిపూజ

ముధోల్: స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మరుగుదొడ్డి నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల కోసం ఉపాధిహామీ నిధుల నుంచి మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు ఏపీవో శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ్‌పటేల్ తదితరులున్నారు.

సమస్య తీర్చిన పోలీసులు

కుంటాల: శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు కల్వర్టు వద్ద ఏర్పడిన బుంగను పూడ్చి ప్రశంసలు పొందారు. మండలంలోని కల్లూరు నుంచి కుంటాల వెళ్లే మార్గంలో అందాకూర్ కల్వర్టు వద్ద వర్షాలకు బుంగ ఏర్పడింది. గురువారం అటుగా వెళ్తున్న ఎస్సై భాస్కరాచారి స్పందించి ప్రమాదాలు జరగకుండా మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న గ్రామస్తులు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ వీడీసీ సభ్యులు చేపట్టిన రిలే దీక్షలు గురువారం 24వ రోజుకు చేరాయి. గ్రామ సమీపంలో జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిని గతంలో ఉన్న సర్వీసు రోడ్డును అనుసంధానిస్తూ నిర్మించారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ కడ్తాల్ గ్రామానికి సర్వీసు రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీడీసీ సభ్యులు బర్మదాసు, రహిమత్, అశోక్, రవి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయి పల్లకిసేవ


సాయిబాబా ఆలయం వద్ద భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో సాయిదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో సాయిపల్లకి సేవ గురువారం వైభవంగా ప్రారంభమైంది. మొదటిరోజు పల్లకి సేవ శోభా యాత్ర గండి రామన్న సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమై.. న్యూబస్టాండ్, చైన్‌గేట్, మంచిర్యాల చౌరస్తా మీదుగా శాస్త్రీనగర్ అభయాంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి సాయి పారాయణంలో పాల్గొన్నారు. అంతకుముందు వికాస్ మహారాజ్ ఆధ్వర్యంలో షిర్డీ నుంచి తీసుకొచ్చి సాయివారి పాదుకలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రెండోరోజుకు హమాలీల సమ్మె


సారంగపూర్ : మాట్లాడుతున్న పుండలిక్



ఖానాపూర్‌లో దీక్ష చేస్తున్న కార్మికులు

సారంగపూర్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన హమాలీల సమ్మె గురువారం రెండోరోజుకు చేరింది. ఏఐటీయూసీ హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పుండలిక్ మాట్లాడుతూ లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీలను రూ. 26నుంచి రూ.29కు, బోనస్ రూ.3వేల నుంచి రూ.8వేలకు పెంచి బీమా, యూనిఫాం అలవెన్సులు అందించాలని గతేడాది అక్టోబర్ 4న ఒప్పందం జరిగినట్లు వివరించారు. ప్రభుత్వం సమస్య పరిష్కరించాలని కోరారు. హమాలీ, చాటావాల కార్మికులు ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. నాయకుడు ముత్తన్న, హమాలీలు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట హమాలీలు చేపట్టిన నిరవధిక దీక్ష రెండో రోజుకు చేరింది. శ్రీనివాస్, రాజు, భీమేశ్, రమేశ్, నర్సయ్య, చిన్నయ్య, భూమారెడ్డి ఉన్నారు.

వీహెచ్‌పీ మాతృశక్తి కమిటీ ఎన్నిక


పుస్తకం ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాతృశక్తి ప్రాంతం సహ సంయోజక్ శ్రీవాణి ఆధ్వర్యంలో మహిష నగర మాతృశక్తి కమిటీలను ఎన్నుకున్నారు. ఈ మేరకు వారికి బాధ్యతలు అప్పగించారు.

నగర మాతృశక్తి సంయోజక్‌గా సుప్రియ, సహ సంయోజక్‌గా రాఘవి, సత్సంగ్, బాల సంస్కారకేంద్ర ప్రముఖ్‌గా మియాపురం శ్రీవాణి, జ్యోతి, సేవా ప్రముఖ్‌గా బచ్చువార్ మమత, సహ సేవా ప్రముఖ్‌గా ధన శ్రీ, ముత్యం స్రవంతి, గుజ్జుల్‌వార్ సవిత, గంగామణిలను ఎన్నుకున్నారు. అనంతరం వీహెచ్‌పీ ప్రగతి ప్రస్థానం ప్రత్యేక సంచిక పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, నగర అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డి రాజేందర్, కార్యదర్శి శివ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో పని చేస్తున్న వీవోఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26వేల గౌరవ వేతనం ఇవ్వాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని వీవోఏల సంఘం మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. వీవోఏలకు బీమా సౌకర్యం కల్పించి, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా గౌరవ వేతనం చెల్లించాలని కోరారు.

మండల కార్యవర్గం..

అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండలాధ్యక్షురాలిగా గొండ లావణ్య, ఉపాధ్యక్షుడిగా బాదావత్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా గాజుల గంగాధర్, కోశాధికారిగా అజ్మీరా నరేశ్, సహాయ కార్యదర్శిగా స్వరూప ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ముత్యం, సంపత్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


కుంటాల : ఆవిష్కరిస్తున్న ఎంఈవో ముత్యం


నర్సాపూర్(జి)లో..

కుంటాల: పీఆర్టీయూ టీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కుంటాల ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈవో ముత్యం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అంబకంటి సతీశ్ కుమార్, కార్యదర్శి కొండా ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సక్రపు గజేందర్, మోహన్, సిద్ధిరాం, సగ్గం గంగాధర్, సోమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కిషన్‌రావు, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గంగాచరణ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లస్మన్న, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి శ్రీనివాస్, డీటీ వాహీదొద్దీన్, ఆర్ఐ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

తానూరు: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు రాజేశ్ బాబు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని కల్యాణ మండపంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, నాయకులు బాలాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.